క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కాప్రా: సైనిక్‌పురి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతుల కారణంగా పలు కాలనీలకు విద్యుత్‌ సరఫరా ఉండదని విద్యుత్‌ ఏఈ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు హస్తినాపురి, సైనిక్‌పురి, నిర్మల్‌నగర్‌, హెచ్‌ఎంటీ బీ కాలనీలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
బోడుప్పల్‌: 11 కేవీ మల్లికార్జుననగర్‌ ఫీడర్‌ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్న ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మల్లికార్జున్‌నగర్‌, కుమ్మరికుంట, చిలుకానగర్‌, న్యూ రాంనగర్‌, శివాలయం ఏరియా, ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.
ఉప్పల్‌: ఆదర్శ్‌నగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాయిరాం నగర్‌, ఆదర్శ్‌నగర్‌, వేంకటేశ్వరకాలనీ, ఆనంద్‌నగర్‌, మ్యాక్‌డోల్‌ కాలనీ, న్యూ హేమానగర్‌, పద్మావతికాలనీ, వెస్ట్‌ బాలాజీహిల్స్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్‌ తెలిపారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి



ఇందిరమ్మ దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌కు వచ్చిన వారికి డబ్బులు ఇవ్వకూడదని, అలా అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ అన్నారు. నాచారం డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 6795 దరఖాస్తు చేసుకోగా.. 2383 దరఖాస్తులను పరిశీలించారు. ఇంకా 4412 దరఖాస్తులను 23 మంది సిబ్బంది వెరిఫికేషన్‌ చేస్తారన్నారు. కొన్ని ప్రాంతాల్లో డబ్బులు అడుగుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అపోహలకు గురికావొద్దని స్పష్టం చేశారు.

పద్మశాలీ సంఘం ఆర్గనైజర్‌ సెక్రటరీగా దేవేందర్‌



బోడుప్పల్‌: బోడుప్పల్‌కు చెందిన ఎలివేటి దేవేందర్‌ తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆర్గనైజర్‌ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. నాయకులు పడతం లోకేష్‌, రచ్చ శ్రీనివాస్‌, వెంకటేష్‌, శ్రీహరి, భిక్షపతి, రమేష్‌, జగదీష్‌ ఆయనను సత్కరించారు.

టెర్మినల్‌లో సందర్శకుల సందడి

13 నుంచి 17 వరకు సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



సందర్శకులతో చర్లపల్లి టెర్మినల్‌

కుషాయిగూడ: ఆధునాతన హంగులతో ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం టెర్మినల్‌ను చూసేందుకు సందర్శకుల తాకిడి మొదలైంది. విశాలమైన ప్లాట్‌ఫామ్స్‌, ఆటోమెటిక్‌ టికెట్‌ బుకింగ్‌ కౌంటర్లు, ఎస్కలేటర్లు, విశ్రాంతి గదులు, ఫుడ్‌కోర్టుతో పాటుగా ఇతర సౌకర్యాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు.
తొలిరోజైన మంగళవారం చర్లపల్లి టెర్మినల్‌లో భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌, గోల్కొండ, కాగజ్‌నగర్‌ రైళ్లు నిలిపినట్లు టెర్మినల్‌ అధికారులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా 13 నుంచి 17 వరకు చర్లపల్లి టెర్మినల్‌ నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

రూపురేఖలు మారిపోయాయి



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చెన్నై నుంచి తరచుగా మా బంధువుల ఇంటికి వస్తుంటాం. గతంలో సాధారణంగా ఉన్న చర్లపల్లి టెర్మినల్‌ అద్భుతంగా మారిపోయింది.

– చిత్ర, చెన్నై

ఎయిర్‌పోర్టును తలపిస్తుంది



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ ఊహించని రీతిలో అభివృద్ధి చెందింది. ఇటువైపుగా వచ్చిన మేము టెర్మినల్‌ను చూసి వెళ్దామని వచ్చాం. కళ్లు చెదిరిపోయేలా మారిపోయింది. టెర్మినల్‌ను చూస్తుంటే ఎయిర్‌పోర్టును తలపిస్తుంది.

– వంగాల మల్లేష్‌, మేడిపల్లి

సమర్థవంతంగా నిర్వహించాలి



అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన చర్లపల్లి టెర్మినల్‌ అద్భుతంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం టెర్మినల్‌లో కల్పించిన వసతులు చాలా బాగున్నాయి. టెర్మినల్‌ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి టెర్మినల్‌ను పరిశుభ్రంగాఉంచి టెర్మినల్‌ ప్రతిష్టను మరింత పెంచాలి.

– విజయ్‌కుమార్‌, కుషాయిగూడ

రూ. 30 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్‌: దశాబ్ద కాలంగా గౌతంనగర్‌ గేటు వద్ద వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీరనున్నాయి. రూ.30 కోట్లతో గౌతంనగర్‌ గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టేందుకు మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో రైల్వే అధికారులు, ప్రాజెక్టు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌ శాఖ, జలమండలి అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. వాజ్‌పేయినగర్‌, అల్వాల్‌, మచ్చబొల్లారం వివిధ ప్రాంతాలలో ఆర్‌యూబీ నిర్మాణాలపై ఎమ్మెల్యే చర్చించారు. త్వరలోనే పనులు ప్రారంభించి సమన్వయంతో పూర్తి చేయాలని ఆయన వివిధ శాఖల అధికారులకు సూచించినట్లు సమాచారం. కార్పొరేటర్‌ మేకల సునీతారాముయాదవ్‌, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

కాప్రా: హస్తినాపురి కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణితో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 20 లక్షలతో కాలనీ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా డివిజన్‌ అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందని కార్పొరేటర్‌ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.
రూ.60 లక్షలతో సీసీరోడ్డు పనులు..
మల్లాపూర్‌: ఓల్డ్‌ మల్లాపూర్‌ ఈదమ్మ దేవాలయం వద్ద రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. దశల వారీగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను చేపడతామని వివరించారు. మల్లాపూర్‌ ఏఈ స్రవంతి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు బిక్షపతి, రామారావు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు

ఉప్పల్‌: ఉప్పల్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్‌ ఫౌండేషన్‌ నుంచి నిపుణులు మోహన్‌పాటిల్‌, మాచపల్లి బాపురావ్‌లు మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాయితీ, చిత్తశుద్ధి, విశ్వాసం, కలిసి పనిచేసేలా ఇతరులను ప్రేరేపించడం లాంటి అంశాల్లో విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చారు. ప్రిన్సిపాల్‌ డా. విజయ్‌ కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డా. రవిప్రసాద్‌, సమన్వయకర్త విశ్వనాథ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వేపై ఆరా

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ బీజేఆర్‌నగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను స్థానిక కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న ఆర్పీలు అఖిల, శ్రావణిలను సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామన్నారు. బాబు, కిషోర్‌, మోసిన్‌, సలీమ్‌, రంగమ్మ, లక్ష్మి, అక్తర్‌ తదితరులున్నారు.

కార్పొరేటర్‌ పర్యటన

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్‌, విద్యుత్‌ వైర్లు, స్తంభాల మరమ్మతుల కోసం అధికారులను అప్రమత్తం చేశామని అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం విద్యుత్‌ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

‘తులం బంగారం’ హామీ నిలబెట్టుకోవాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన తులం బంగారం హామీ అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కాప్రా తహసీల్దార్‌ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కాప్రా మండల పరిధిలోని 75 మందికి చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి గత ప్రభుత్వం రూ.1,00,116 అందించిందని, ప్రస్తుత ప్రభుత్వం దీనికి తోడు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హామీలు నెలబెట్టుకుంటే పేదింటి ఆడబిడ్డలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్‌ సుచరిత, కార్పొరేటర్లు స్వర్ణరాజ్‌ శివమణి, బొంతు శ్రీదేవి, బీఆర్‌ఎస్‌ నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, బైరి నవీన్‌గౌడ్‌, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ఉప్పల్‌: ఉప్పల్‌ నియోజకవర్గం అభివృద్ధికి రూ. 30 కోట్లు కేటాయించాలని మంగళవారం కాంగ్రెస్‌ పార్టీ ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి గ్రేటర్‌ కమిషనర్‌ ఇలంబర్తికి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో డివిజన్‌కు రూ.3 కోట్ల చొప్పున 10 డివిజన్‌లకు కలిపి రూ. 30 కోట్లు కేటాయించాలని కోరారు. దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఆంజనేయులు (ఫైల్‌)

మల్కాజిగిరి: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, ఎస్సై శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం... చింతల్‌బస్తీకి చెందిన ఆంజనేయులు(40) కొన్నేళ్లుగా ఓల్డ్‌ మల్కాజిగిరిలో పోలీస్‌స్టేషన్‌ పక్కన పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి బండి మూసివేసిన తర్వాత ఇంటికెళ్లాడు. ఫోన్‌ బండిలోనే మర్చిపోవడంతో తిరిగి బండి వద్దకు వచ్చి డోర్‌ తీస్తుండగా విద్యుత్‌షాక్‌తో కిందపడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు స్థానిక ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాల పంపిణీ





కేలండర్‌ ఆవిష్కరణలో మేయర్‌ అజయ్‌యాదవ్‌

బోడుప్పల్‌: మున్సిపల్‌ పారిశుధ్య కార్మికులకు మేయర్‌ అజయ్‌యాదవ్‌, కమిషనర్‌ రామలింగం భద్రత పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి భద్రతకు నగర పాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. స్థానిక నేతలు వెంకటేష్‌ గుప్తా, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి, కృపాసాగర్‌ పాల్గొన్నారు.
ముదిరాజ్‌ సంఘం కేలండర్‌ ఆవిష్కరణ..
బోడుప్పల్‌: ముదిరాజ్‌ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. న్యూ హేమానగర్‌ ముదిరాజ్‌ సంఘం 2025 కేలండర్‌ను మేయర్‌ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ముదిరాజ్‌ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని సంఘం ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు బొమ్మక్‌ సుగుణ బాలయ్య, మహేశ్వరి కృపాసాగర్‌, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆనందబాబు, అధ్యక్షులు మన్నె అంజయ్య , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సురేష్‌ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

అల్వాల్‌: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్‌ చేసింది. మంగళవారం అల్వాల్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కామారెడ్డిలో జరిగిన బహిరంగ సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీని అమలు చేయాలని కోరారు. దండుగుల వెంకటేష్‌, మల్లికార్జున్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



కాప్రా: మధురైలో జనవరి 31న జరిగే స్పీడ్‌ స్కేటింగ్‌ జాతీయ పోటీలకు కాప్రా సర్కిల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌ స్కేటింగ్‌ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పసిడి, రజత పతకాలు సాధించారు. ఇదే పట్టుదలతో జాతీయస్థాయిలో విద్యార్థులు రాణిస్తారని తెలంగాణ స్పీడ్‌ స్కేటింగ్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి తరుణ్‌ కిషోర్‌ తెలిపారు.

ప్రీ లాంచ్‌ పేరుతో కుచ్చుటోపీ

సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

రామంతాపూర్‌: రామంతాపూర్‌లోని ఉప్పల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదుట ఓ ఇన్‌ఫ్రా డెవలపర్‌ సంస్థ బాధితులు ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్‌ దగ్గరలోని హేమానగర్‌లోని సర్వే నెంబర్‌ 215లో సుమారు 3000 గజాల స్థలాన్ని అమ్మేందుకు ప్రీ లాంచ్‌ పేరిట 180 మంది నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేశారని ఆరోపణలున్నాయి. 103 మందికి డెవలపర్‌మెంట్‌ అగ్రిమెంట్‌ చేయగా.. 44 మందికి చేయలేదన్నారు. కట్టిన డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం 44 మందికి అగ్రిమెంట్‌ చేసేందుకు వచ్చిన ఇన్‌ఫ్రా సంస్థ యజమాని శ్రీకాంత్‌ను గతంలో క్రిమినెంట్‌ చేసుకున్న వారు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకోవడంతో శ్రీకాంత్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామంతో సంస్థ యాజమాన్యం అగ్రిమెంట్‌ రద్దు చేసి తామే కట్టిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ బాధితులు ఆందోళనకు దిగారు.

◆ **మరొకరికి రిజిస్ట్రేషన్‌ చేయొద్దు..**

ఉప్పల్‌: క్రీతిక ఇన్‌ఫ్రా డెవలపర్స్‌ సంస్థ సీఈవో శ్రీకాంత్‌ తమకు కేటాయించిన ప్లాట్లను మరొకరికి రిజిస్ట్రేషన్‌ చేయిస్తున్నాడని వాటిని నిషేధిత జాబితాల్లో పెట్టి మరొకరికి రిజిస్ట్రేషన్‌ చేయొద్దని సబ్‌ రిజిస్ట్రార్‌ను బాధితులు కోరారు.

◆ **డబ్బులు తిరిగి ఇచ్చేస్తాం**

కొనుగోలుదారులకు తమపై నమ్మకం లేకపోతే అగ్రిమెంట్‌ లెటర్‌ను రద్దు చేసి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని రియల్‌ ఎస్టేట్‌ సంస్థ యజమాని శ్రీకాంత్‌ వివరణ ఇచ్చారు.



ఉప్పల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో బాధితులు